క్లుప్తంగా

గుట్టరాజేశ్వరస్వామికి ఊరేగింపు సేవ



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

సారంగాపూర్: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా ఆదివారం బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలోని అటవీప్రాంతం కొండపై వెలసిన గుట్టరాజేశ్వరస్వామికి గ్రామంలో ఊరేగింపు సేవ నిర్వహించారు. సర్పంచ్ గుడిసె శ్రీమతి, ఎంపీటీసీ ఆడెపు మల్లీశ్వరి, ఆలయ చైర్మన్ కొల్లూరి ప్రభాకర్, ఉపసర్పంచ్ పూదూరి రమేశ్, ఆలయ అర్చకులు రాజన్న, ప్రవీణ్, గూడెం సత్తెన్న, విగ్నేష్ పాల్గొన్నారు.

పోచమ్మకు బోనాలు



బోనాలతో భక్తులు

కథలాపూర్: మండలంలోని సిరికొండలో బద్దిపోచమ్మ బోనాల పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని దేవతకు నైవేద్యం సమర్పించారు.

గోశాలకు సామగ్రి అందజేత



సామగ్రి అందజేస్తున్న యూత్ సభ్యులు

రాయికల్: మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామంలోని గాయత్రి గోశాల యాగశాలకు మూటపెల్లి గ్రామానికి చెందిన జమాన్ యూత్ సభ్యులు ఆదివారం రూ.21వేల విలువ గల సామగ్రి అందజేశారు. వీరిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గోశాల నిర్వాహకులు సామల్ల బుచ్చన్న, కమలాకర్, గంగాధర్, సర్పంచ్ స్వప్న, ఎంపీటీసీ దొంతి నాగరాజు, ఉపసర్పంచ్ బొంగురాజు, యువజన సంఘ సభ్యులు అర్జున్, రమే, వేణు, సతీ, మర్యాద రాజేందర్ పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు



కృష్ణారావును సన్మానిస్తున్న నాయకులు

కోరుట్ల: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామ శివారులో గల శివాలయంలో టీపీసీసీ నాయకులు జువ్వాడి కృష్ణారావు ఆదివారం పూజల్లో పాల్గొన్నారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణారావును సన్మానించారు. సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాంగౌడ్, కాంగ్రెస్ కోరుట్ల, మెట్‌పల్లి మండల అధ్యక్షులు కుంతం రాజం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, ముక్కెర లింబాద్రి, ఈశ్వర్, రాజేందర్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మల్యాల: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన రైతు బద్దం మల్లికార్జునరెడ్డికి చెందిన గడ్డివాముకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. ముత్యంపేట గ్రామ శివారులోని ఎడ్ల కొట్టంలో గడ్డి కట్టలు నిల్వ చేయగా ఆదివారం ప్రమాదశాత్తు మంటలు అంటుకుని సుమారు 650 గడ్డి కట్టలు మంటల్లో కాలిపోయాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైరింజన్‌తోపాటు స్థానికులు, సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి తదితరులు మంటలు ఆర్పారు. గడ్డి వాము దగ్ధం కావడంతో సుమారు రూ.35వేలు నష్టపోయామని రైతు మల్లికార్జునరెడ్డి వాపోయాడు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

కోరుట్లరూరల్: క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య అన్నారు. ఈ మేరకు మండలంలోని కల్లూరు శివారులో గల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆదివారం ఆమె పరిశీలించారు. పాఠశాలలో వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల ఇన్‌చార్జి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొంతింటి కల నిజమయ్యేదెన్నడు?

- ఎనిమిదేళ్ల క్రితం డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు
- ఇళ్ల స్థలాల ఎంపికలో జాప్యం..
- నాలుగు గ్రామాల్లో ఇంకా ప్రారంభంకాని పనులు



గంభీర్‌పూర్ శివారులో డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం అధికారులు గుర్తించిన స్థలం ఇదే

కథలాపూర్: ఇళ్లు లేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితం డబుల్‌బెడ్రూం ఇళ్ల పథకం ప్రవేశపెట్టింది. దీంతో సొంతిల్లు రాబోతుందని నిరుపేదలు ఆశగా ఎదురుచూశారు. కానీ ఎనిమిదేళ్లు గడిచినా ఒక్క ఇల్లు కూడా పూర్తికాకపోవడంతో నిరాశకు గురవుతున్నారు.

ఇప్పటికీ ప్రారంభం కాని పనులు..

కథలాపూర్ మండలంలో మొదటి విడతలో కథలాపూర్ గ్రామానికి 15, సిరికొండకు 15, తాండ్యాలకు 15, గంభీర్‌పూర్‌కు 15 ఇళ్లు మంజూరు చేశారు. లబ్ధిదారులను లాటరీ పద్ధతిలో అప్పట్లోనే ఎంపిక చేశారు. ఇప్పటికీ పనులు ప్రారంభంకాలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చినా తమకు డబుల్ బెడ్రూం ఇళ్ల 'కల' నెరవేర్చలేదని పేదలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల స్థలాల ఎంపికలో జాప్యం..

మండలంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల పథకానికి గ్రామాలవారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. కథలాపూర్‌లో 279, తాండ్యాలలో 272, గంభీర్‌పూర్‌లో 277, సిరికొండలో 250 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఒక్కో గ్రామానికి 15 ఇళ్లకల మాత్రమే మంజూరు చేశారు. మండలంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం ఎంపికైన గ్రామాల్లో స్థలం కేటాయింపులో ఇన్నిరోజులు జాప్యం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కథలాపూర్‌లో స్థలం ఎంపిక చేసినప్పటికీ పనులు ప్రారంభించలేదు. సిరికొండ, తాండ్యాల, గంభీర్‌పూర్‌లో ఇళ్ల స్థలాలు ఎంపిక చేయకపోవడం దారుణమని లబ్ధిదారులు మండిపడుతున్నారు. డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం 8ఏళ్లుగా నిరీక్షించినా.. సొంతిల్లు అనేది కలగానే మిగిలిందని పేదలు వాపోతున్నారు. పాలకులు ఇప్పుడైనా స్పందించి మంజూరైన ఇళ్లను త్వరగా నిర్మించి ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు

కథలాపూర్‌లో ఇళ్లకు స్థలం ఉన్నప్పటికీ నిర్మించేందుకు కాంట్రాక్టర్ ముందుకు రావడంలేదు. రీ టెండర్ నిర్వహిస్తాం. గంభీర్‌పూర్, తాండ్యాల, సిరికొండ గ్రామాల్లో స్థలాల ఎంపిక కాలేదు. అందుకోసం జాప్యం జరుగుతోంది. మరోసారి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

– వెంకటరమణ, ఆర్‌అండ్‌బీ డీఈ, మెట్‌పల్లి

త్వరగా నిర్మించి ఇవ్వాలి



డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం గ్రామాల్లో వందలాది మంది పేదలు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేసింది అరకొరనే. అవి కూడా ఏళ్ల తరబడి నిర్మించకపోవడం దారుణం. పాలకులకు పట్టింపులేకపోవడం బాధాకరం. ఇల్లు లేని పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేసి త్వరగా నిర్మించి ఇవ్వాలి.

– ఎం.డీ అజీమ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు

ఏళ్ల తరబడి జాప్యం చేయొద్దు



సొంతిల్లు లేకపోవడంతో డబుల్‌బెడ్రూం ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్న. మంజూరైందని చెప్పిండ్రు. ఇన్నేళ్లు అయినా ఇల్లు ఎక్కడా కట్టించలేదు. ఏ స్థలంలో కడతారో చెప్పడం లేదు. ఏళ్ల తరబడి ఊరిస్తున్నారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చడంలో ఏళ్ల తరబడి జాప్యం చేయొద్దు.

– ధర్మపురి కల్పన, లబ్ధిదారు, సిరికొండ

కనుల పండువగా రథోత్సవం



రాయికల్: రథాన్ని లాగుతున్న భక్తులు



గొల్లపల్లి: రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



ధర్మపురి: అక్కపెల్లిలో స్వామివారి ఊరేగింపు

రాయికల్: పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయంలో ఆదివారం రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయంలోని అర్చకులు సతీశ్‌శర్మ, రమేశ్‌శర్మ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథంపై ప్రతిష్ఠించి ఆలయం చుట్టూ ఊరేగించారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి కౌన్సిలర్లు ఎలిగేటి లతిక అనిల్, ఆలయ కమిటీ నిర్వాహకులు తుమ్మల సదాశివరెడ్డి, శంకర్, మ్యాకల రమేశ్, ఎలుగందుల సత్యనారాయణ పాల్గొన్నారు.

లొత్తునూర్‌లో..

గొల్లపల్లి: మండలంలోని లొత్తునూర్‌లో శ్రీరాజరాజేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం ఘనంగా సాగింది. ఆలయ కమిటీ కార్యవర్గం, సర్పంచ్ మహేశ్వరి, ఎంపీటీసీ సంతోషి, పి.సత్యం, స్వామి, రాజు, తిరుపతి, శేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రథోత్సవం

ధర్మపురి: ధర్మపురిలోని అక్కపెల్లి శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో చైర్మన్ ప్రసాద్ ఆధ్వర్యంలో రథంపై స్వామివారిని ఆలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో వేడుకలు నిర్వహించారు. నేరెల్ల సాంబశివ దేవాలయంలో శివపార్వతుల రథోత్సవం ఘనంగా నిర్వహించారు.

నాగేశ్వరాలయంలో..

బుగ్గారం: బుగ్గారం గ్రామశివారులోని శ్రీ సాంబశివ నాగేశ్వరాలయంలో రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బాదినేని రాజమణి, సర్పంచ్ మూల సుమలత, ఆలయ కమిటీ చైర్మన్ మసర్తి రాజరెడ్డి, వైస్ ఎంపీపీ జోగినపెల్లి సుచేందర్, నాయకులు మూల శ్రీనివాసగౌడ్, గాలిపెల్లి మహేశ్, పొన్నం సత్తన్న, ప్రవీణ్, జంగ శ్రీనివాస్ పాల్గొన్నారు.



బుగ్గారం: రథోత్సవంలో భక్తులు

వైభవంగా ఛత్రపతి శివాజీ జయంతి



రాయికల్: నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్



ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలో..



వెల్గటూర్: నివాళి అర్పిస్తున్న బజరంగ్‌దల్ సభ్యులు



కోరుట్లరూరల్: సంగెంలో..

రాయికల్/కోరుట్లరూరల్/కథలాపూర్/ఇబ్రహీంపట్నం/కొడిమ్యాల/మల్లాపూర్/ధర్మపురి/సారంగాపూర్/వెల్గటూర్/మెట్‌పల్లి: జగిత్యాల జిల్లావ్యాప్తంగా ఛత్రపతి శివాజీ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పట్టణాల్లో, గ్రామాల్లోని పురవీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు.

లొంక రామన్న జాతర



పూజల్లో పాల్గొన్న భక్తులు

కథలాపూర్: మండలంలోని పోతారం గ్రామశివారులో లొంక రామన్న జాతర, చింతకుంటలో తారకేశ్వరస్వామి, అంబారిపేటలో ఓంకారేశ్వరస్వామి జాతర ఉత్సవాలు ఆదివారం భక్తజన సందడిలో వైభవంగా జరిగాయి. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, ఆద్య గోలి ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కేపీఎల్ సీజన్-3 ప్రారంభం

కోరుట్లటౌన్: పట్టణంలో కేపీఎల్ సీజన్-3 క్రికెట్ మ్యాచ్‌ను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆదివారం ప్రారంభించారు. క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ చేశారు.

21న ఎక్సైజ్‌స్టేషన్‌లో వాహనాలకు వేలం

మెట్‌పల్లి/ఇబ్రహీంపట్నం: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ బైక్‌లను 21న వేలం వేస్తున్నట్లు సీఐ రాధ ఆదివారం తెలిపారు.

సంక్షిప్త వార్తలు

✦సాంబశివ క్యాలెండర్ ఆవిష్కరణ

ధర్మపురి: మండలంలోని నేరెల్ల సాంబశివ ఆలయంలో ఆదివారం న్యాయవాది జాజాల రమేశ్ రూపొందించిన స్వామివారి క్యాలెండర్‌ను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆలయాల కమిటీ చైర్మన్లు కాసారపు రాజాగౌడ్, జంగిలి తిరుపతి, నాయకులు ఎస్.దినేశ్, కాసారపు బాలాగౌడ్, వేముల రాజేశ్, సింహరాజు ప్రసాద్, రాందేని మొగిలి, ఇంద్రాల మల్లేశం పాల్గొన్నారు.

✦పేకాటరాయుళ్ల అరెస్ట్

మెట్‌పల్లి: మండలంలోని చౌలమద్ది శివారులో పేకాట శిబిరంపై ఆదివారం దాడి చేశారు. ఏడుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.15,260 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

✦ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వెల్గటూర్: వెల్గటూర్, ఎండపల్లి మండలాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నరేశ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. రెండు మండలాల పరిధిలోని పరిసర గ్రామాల్లో దొంగల అలజడి మళ్లీ మొదలైందని, ముఖ్యంగా వ్యవసాయ పొలాల వద్ద ఉన్న కరెంటు మోటార్లు, కరెంటు వైర్లు, స్టాటర్లు దొంగిలిస్తున్నారని, రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

✦ఆలయంలో అన్నదానం

మల్యాల: మండలంలోని మద్దుట్ల గ్రామంలో శివరాత్రి పండుగను పురస్కరించుకుని స్థానిక గంగమ్మ ఆలయంలో అన్నదానం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, గంగమ్మ ఆలయంలో పూజలు చేసి, అన్నదానంలో పాల్గొన్నారు. స్థానికుడు పడకంటి రాజేశ్ అన్నదానానికి రూ.30వేలు విరాళంగా అందజేశారు. అనంతరం మద్దుట్ల గ్రామంలో శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కెల్లేటి మల్లమ్మ, కెల్లెటి రమేశ్ మ్యాకల మహేశ్, చంద్రయ్య, శంకర్, రాహుల్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి పూర్వ విద్యార్థుల చేయూత



నగదు అందజేస్తున్న మిత్రబృందం

ధర్మపురి: అనారోగ్యం బారిన పడి ఆపదలో ఉన్న తోటి మిత్రుడిని స్నేహితులు చేయూత అందించారు. మండంలోని దమ్మన్నపేటకు చెందిన నేరెల్ల రాములుగౌడ్ ఇటీవల అనారోగ్యానికి గురి కాగా వైద్యులు ఎడమకాలు తొలగించారు. దీంతో బాధితుడు రాములుకు జీవనోపాధి కరువైంది. 1988–89 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రాములు కుటుంబానికి ఆదివారం రూ.60వేల నగదు అందజేశారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

కోరుట్లరూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు సమగ్ర అభివృద్ధి జరిగాయని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని యూసుఫ్‌నగర్‌లో రూ.20లక్షల వ్యయంతో చేపట్టే సీసీరోడ్ల పనులకు శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. మండలంలోని గ్రామాల్లో అన్ని రోడ్లను సీసీరోడ్లుగా మారుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను స్థానిక నాయకులు సన్మానించారు. ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటివెంకట్రావు, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచ్‌లు గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, వనతడుపుల అంజయ్య, ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ సురేశ్ గౌడ్ పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

కోరుట్ల: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఐ రాజశేఖర్ రాజును ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆదివారం సన్మానించారు. సీఐ రాజశేఖర్‌రాజు జగిత్యాలకు బదిలీపై వెళ్తున్నారు. ఈ సందర్భంగా సీఐ సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. ఎంపీపీ తోట నారాయణ, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, రాజేశ్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకనకసోమేశ్వర స్వామి జాతర



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మల్లాపూర్: మండల కేంద్రంలో శ్రీకనక సోమేశ్వర స్వామి జాతర మహోత్సవాలలో భాగంగా ఆదివారం సోమేశ్వర కొండ వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడె డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజనఆదిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వేంపేట నర్సారెడ్డి, ఎంపీటీసీలు ఆకుతోట రాజేశ్ మరిపెల్లి సత్తెమ్మ పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రభాకర్‌శర్మ, శశికాంత్ శర్మ, సోమేశ్‌శర్మ స్వామివారికి నిత్యపూజ, అభిషేకం, అన్నపూజ నిర్వహించారు. సాయంత్రం 4గంటల నుంచి స్వామి జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎస్సై నవీన్‌కుమార్ నేతృత్వంలో బందోబస్తు చేపట్టారు. తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, రైతుబంధు కమిటీ మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, పీఎస్‌ఎస్ చైర్మన్ సిరిపురం రవీందర్, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాయికల్ పట్టణాభివృద్ధికి కృషిచేస్తున్న



బోట్‌లో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

రాయికల్: పట్టణాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని హన్మాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన బోర్‌ను ఆయన ప్రారంభించారు. పెద్ద చెరువులో మినీ ట్యాంక్‌బండ్ పనులను పరిశీలించారు. చెరువులో కార్యకర్తలతో కలిసి బోట్‌లో ప్రయాణించారు. అనంతరం ఆయన మట్లాడుతూ ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

జగిత్యాలరూరల్: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జగిత్యాలరూరల్ మండలం ఒడ్డెరకాలనీ గ్రామపంచాయతీలో రూ.15లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ఎన్ని నిధులైనా వెచ్చిస్తుందన్నారు. అనంతరం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ నక్కల రాధ, విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు రాజమణి, నారయణ, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మట్టి సంరక్షణ అందరి బాధ్యత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

మల్లాపూర్: సమస్త జీవకోటికి ప్రాణాధారమైన మట్టిని ప్రజలందరూ బాధ్యతగా సంరక్షించాలని ఈషా ఫౌండేషన్ సభ్యుడు అంకతి సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రం శివారులోని సోమేశ్వర కొండ వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సేవ్ సాయిల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన పంచభూతాలతోనే జీవకోటి మనగడ సాగిస్తుందన్నారు. ఈషా సద్గురు ఆదేశాలతోనే ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి సేవ్ సాయిల్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రుద్ర రాంప్రసాద్, వీడీసీ, దేవాదాయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జలపతిరెడ్డి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న రెడ్డి సంఘం సభ్యులు

గొల్లపల్లి/జగిత్యాలరూరల్: జగిత్యాల మండలం నర్సింగపూర్ గ్రామానికి చెందిన గడ్డం జలపతిరెడ్డి కూతుళ్లతో కలిసి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు గొల్లపల్లి మండలం శ్రీరాముపల్లి గ్రామానికి చెందిన రెడ్డి సంఘం సభ్యులు రూ.65వేలు అందజేశారు. సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు నేరెల్ల గంగారెడ్డి, సంఘం అధ్యక్షులు గడ్డం తిరుపతి రెడ్డి, గడ్డం రాంరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం



ఉత్సవమూర్తుల శోభాయాత్ర

రాయికల్: పట్టణంలోని మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో గంగసహిత పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వీరిని ఘనంగా సన్మానించింది. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో అధ్యక్షుడు తోపారపు రవీందర్, రమేశ్, కౌన్సిలర్ కల్లెడ సునీత, నాయకులు తోపారపు ఆశన్న, దువ్వాక మల్లేశం, పల్లికొండ ఎసయ్య పాల్గొన్నారు.